Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

ఆదివారం, జూలై 6, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## పిఎన్‌బి కుంభకోణం..అమెరికాలో నీరవ్‌మోడీ సోదరుడి అరెస్ట్

భారతీయ బ్యాంకులను రూ. వేల కోట్ల మేర మోసం చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ సోదరుడు నేహల్ దీపక్ మోడీ అరెస్ట్ అయ్యారు. భారత ప్రభుత్వం చేసిన అప్పగింత అభ్యర్థన నేపథ్యంలో అమెరికాలో ఈ అరెస్టు చోటు చేసుకుంది. రుణాల విషయంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో నేహల్ మోడీ ప్రమేయం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసిన అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. దాంతో గత వారం అమెరికా పోలీసులు నేహల్‌ను అదుపు లోకి తీసుకున్నారు. తనపై జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసులను రద్దు చేసేలా అతడు ప్రయత్నించినప్పటికీ, ఫలితం లేకపోయింది. దాంతో తాజాగా అతడిని అరెస్టు చేశారు. అతడికి బెల్జియం పౌరసత్వం ఉంది. నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకులో రుణాలు తీసుకొని రూ. 13,500 కోట్ల మేర మోసానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. 2018లో భారత్ నుంచి ఆయన పరారీ అయ్యాడు.



## ట్రంప్ సుంకాలకు మోడీ తలొగ్గుతారు.. : రాహుల్



## రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు

# బాధితులకు భరోసా

## లైంగిక దాడుల నుంచి చిన్నారులు, మహిళల రక్షణకు ఎందాకైనా వెళ్తాం



**న్యాయమంటే శిక్షలు విధించడమే కాదు.. బాధితులకు రక్షణ కల్పించాలి**

**సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తగా ఉండాలి**

**చైల్డ్‌ఫ్రెండ్లీ కోర్టులు స్థాపించిన తొలి రాష్ట్రం తెలంగాణ**

**'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' సదస్సులో సిఎం రేవంత్**

**హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు జడ్జిలు, డిజిపి**

హైదరాబాద్ : చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడిన నిందితుల పట్ల తమ ప్ర భుత్వం ఎ లాంటి దయాదాక్షిణ్యాలు చూపబోదని అలాంటి వారిని క ఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చే శారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయమంటే కేవలం శిక్ష లు వి ధించడం వరకే కాదని, బాధితుల జీవితానికి భ రో సా కల్పించాలని, వారికి అవసరమైన రక్షణ, స మాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీ సుకొని వారి బాల్యా న్ని తిరిగి పొందేలా ఈ చర్య లు ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. శనివా రం నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్ లో ని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృ ద్ధి కేంద్రంలో 'లైంగిక దాడులు బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అనే అంశంపై తెలంగాణ భరోసా ఆధ్వర్యంలో ప్రారంభమైన సదస్సుకు సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు జడ్జిలు,రాష్ట్ర డిజిపి జితేందర్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన చెప్పారు. లైంగిక హింస నుంచి చిన్నారులు, మహిళలను రక్షించేందుకు ఎంత దూరమైనా వెళతామన్నారు. సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా అబ్యూజ్ ను కంట్రోల్ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

### హైదరాబాద్ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు

'వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్' అనే థీమ్‌తో తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరమని సిఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎంతో కీలక మైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను ముఖ్యమంత్రి రేవంత్ అభినందించారు. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణతో పాటు లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా వారికి

(మిగతా 2వ పేజీలో)



## త్వరలో కొత్త స్టాంపుల విధానం

**వచ్చే శాసనసభ సమావేశాల్లోనే బిల్లు**

**మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గించే యోచన**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

హైదరాబాద్: సాధారణ ప్రజలకు ఎలాంటి నష్టం కలిగించకుండా, వ్యాపార ఒప్పందాల విషయంలో పారదర్శకత ఉండేలా రాష్ట్రంలో కొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా భారతీయ స్టాంపుల చట్టాన్ని అనుసరించి వచ్చే శాసనసభ సమావేశాల్లోనే తెలంగాణ స్టాంపుల చట్టం సవరణ బిల్లు%–%2025ను ప్రవేశపెట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సవరణ బిల్లుపై శనివారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హన్మంతులు పాల్గొన్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో ఇందుకు సంబంధించి తెచ్చిన బిల్లుపై కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేయడం, వాటిని నివృత్తి చేసిన తర్వాత కూడా తిప్పి పంపిన విషయాన్ని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన పొంగులేటి.. 2021లో

(మిగతా 2వ పేజీలో)

# అధికారులు చట్టాలు తెలుసుకోవాలి

**శిఖం పట్టా భూమిలో మీరెలా జోక్యం చేసుకుంటారు?**

**నీటిపారుదల శాఖ అధికారులపై హైకోర్టు మండిపాటు**

**శిఖం సర్కారీ భూమి, శిఖం పట్టా భూమి మధ్య తేడా ఉంది**

**అధికారులను కూర్చోబెట్టి చట్టాలు నేర్పాలన్న న్యాయమూర్తి**

హైదరాబాద్: రాష్ట్రంలో కనీస చట్టాలు తెలియకుండా అధికారులు విధులు నిర్వహిస్తున్నారని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆయా శాఖల పరిధిలో పనిచేసే అధికారులు చట్టాలు తెలుసుకోవాలని సూచించింది. వీలైతే వారికి తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట్ మండలం మల్కపేట చెరువులోకి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని నింపేందుకు చేపట్టిన కాలువ పనులను ఆపేయాలని కోరుతూ తండు చంద్రయ్య సహా మరో 10 మంది రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పనుల కారణంగా తమ పట్టా భూములు శాశ్వతంగా ముంపునకు గురవుతాయని తెలిపారు. దీనిపై మే 9న తాము అధికారులకు వినతిపత్రం సమర్పించినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి

(మిగతా 2వ పేజీలో)



# కొండారెడ్డిపల్లికి వస్తావా? కొడంగల్‌కు రమ్మంటావా?

**రైతులకు ఎవరు మంచి చేశారో చర్చకు సిద్ధం**

**మా పార్టీ తరపున రేవంత్ సవాలును స్వీకరిస్తున్నా**

**చర్చకు ప్రిపేర్ అయ్యేందుకు 72 గంటల టైమ్ ఇస్తున్నా**

**లేదంటే 8న ప్రెస్‌క్లబ్‌లో 11 గంటలకు రెఢీ: కేటీఆర్**



హైదరాబాద్: 'రైతులకు ఎవరు మంచి చేశారో చర్చిద్దాం.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రొటీన్‌గా రంకెలు వేస్తూ చాలెంజ్‌లు చేస్తున్నారు. ఆయన ముచ్చట తీర్చేందుకు బీఆర్‌ఎస్ తరఫున నేను సిద్ధం. ఆయన స్థాయికి కేసీఆర్ రావాల్సిన అవసరం లేదు. రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లి లేదా ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్‌లో చర్చకు సిద్ధం. లేదంటే మా నాయకుడు కేసీఆర్ సొంతూరు చింతమడక, ఆయన నియోజకవర్గం గజ్వేల్ అయినా సరే. అసెంబ్లీలో పెడతావో, అంబేద్కర్ విగ్రహం దగ్గర పెడతావో చర్చ నీ ఇష్టం. వేదిక, తేదీ, సమయం అన్నీ సీఎం ఇష్టమున్నట్లుగా నిర్ణయించుకోవచ్చు. బేసిక్స్ కూడా తెలియని సీఎం.. చర్చకు ప్రిపేర్ అయ్యేందుకు 72 గంటల గడువు ఇస్తున్నా. లేదంటే ఈ నెల 8న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు మేమే వేదిక ఏర్పాటు చేసి సీఎం కోసం కుర్చీ వేసి ఎదురుచూస్తాం'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సవాలు చేశారు. శనివారం ఆయన

(మిగతా 2వ పేజీలో)

# ధర్మయుద్ధం ప్రారంభిస్తున్నాం



**ప్రతి గ్యారంటీని అమలు చేసే వరకు అధర్మ ప్రభుత్వంపై పోరాడతాం**

**సామాజిక న్యాయమంటే మోదీని, బీజేపీని తిట్టడం కాదు**

**ఏడాదిన్నరలో ఏం చేశారో చెప్పకుండా చిల్లర మాటలు చెప్పారు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు**

**6 గ్యారంటీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ**

## మహిళా సాధికారతలో తెలంగాణ టాప్

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**12 నుంచి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ**

**ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు**

**ఆర్టీసీలో ఎస్‌హెచ్‌జీలు నడిపే అద్దె బస్సులకు రూ.కోటి చెక్కు అందజేత**



వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
ఆదివారం, జూలై 6, 2025

## త్వరలో కొత్త స్టాంపుల విధానం

ప్రవేశపెట్టిన బిల్లును ఉపసంహరించుకుని, ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 బిల్లును తీసుకువస్తామని చెప్పారు. కొత్త విధానం పకడ్బందీగా ఉండేలా బిల్లును రూపొందించాలని అధికారులను కోరారు.

**భూముల ధరల సవరణపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి**

సామాన్య, మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా రాష్ట్రంలో భూముల ధరలను సవరించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరలను సవరించేందుకు, హేతుబద్ధంగా పెంచేందుకు ఉన్న అవకాశాలపై లోతైన అధ్యయనం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతున్న నేపథ్యంలో మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గించే ఆలోచన చేయాలని, కొత్త వాటితో పోలిస్తే పాత అపార్ట్‌మెంట్‌లకు కొంత వెసులుబాటు ఉండేలా ప్రతిపాదనలు చేయాలని సూచించారు. అన్ని అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అధికారులు చట్టాలు తెలుసుకోవాలి

ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది సందీప్ వాదనలు వినిపించారు.. 'శిఖం సర్కారీ భూములు.. తెలంగాణ భూమి రెవెన్యూ చట్టం 1317 ఫస్లీలోని సెక్షన్ 24 ప్రకారం సర్కారువేనన్నారు. శిఖం పట్టా భూములు ప్రైవేట్ భూములు..'అని నివేదించారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం పిటిషనర్లు పరిహారానికి అర్హులని, పరిహారం చెల్లించిన తర్వాత కాలువ నిర్మాణం చేపట్టవచ్చునని చెప్పారు. 'ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పిటిషనర్ల భూములు ఎప్పుడూ నీటిలో మునిగే ఉంటున్నాయి. పిటిషనర్లు తరచుగా ప్రధాన కాలువ పనులను అడ్డుకుంటున్నారు. తమ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే భూములకు ఎలాంటి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు..'అంటూ ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి తాజాగా తీర్పు వెలువరించారు.

**పిటిషనర్లు సంబంధిత ఆస్తికి పట్టాదారులు**

'శిఖం పట్టా అంటే ఏమిటి? అందులో ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చన్నది కూడా నీటి పారుదల శాఖ అధికారులకు తెలియడం లేదు. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో ఉన్నంత మాత్రాన ప్రతీది సర్కార్ భూమి కాదు. శిఖం సర్కారీ, శిఖం పట్టా భూములు వేర్వేరుగా ఉంటాయి. శిఖం సర్కారీ భూములు పూర్తిగా ప్రభుత్వానివే. అందులో అధికారులు ఏ పనులైనా చేపట్టవచ్చు. కానీ శిఖం పట్టా భూములు ప్రైవేట్‌వి. మామూలుగా వర్షాకాలం నీటి మునక ఉంటుంది కనుక సాగు సాధ్యంకాదు. రబీ సీజన్‌లో మునక తగ్గినప్పుడు వాటిలో పట్టాదారులు పంటను సాగుచేస్తారు. ఆ భూములపై పూర్తి హక్కు వారిదే. ప్రభుత్వ అవసరం కోసం ఆ భూములు తీసుకోవాలని భావిస్తే శిఖం పట్టాదారులు పరిహారానికి అర్హులు. ఎఫ్‌టీఎల్‌లో ఉంది కదా అని పట్టాభూముల నుంచి కాల్వ తవ్వకం చేపడతామంటే ఎలా? పిటిషనర్లు సంబంధిత ఆస్తికి పట్టాదారులు. అధికారులందరినీ కూర్చోబెట్టి నీటి పారుదల, రెవెన్యూ చట్టాలు నేర్పించండి. కాల్వల తవ్వకానికి ఈ న్యాయస్థానం వ్యతిరేకం కాదు..'అని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## కొండారెడ్డిపల్లికి వస్తావా? కొడంగల్‌కు రమ్మంటావా?

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 'తెలంగాణలో రేవంత్‌రెడ్డి ఆయన తొట్టి గ్యాంగ్ మినహా ఎవరూ సంతోషంగా లేరు. దండుపాళ్యం ముఠా రీతిలో బిల్డర్లు, కాంట్రాక్టర్లను బెదిరించి దోచుకుంటూ హామీలు అమలు చేయడం లేదు. రూ.2 లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణను ఏటీఎంగా మార్చి రేవంత్.. 'పే సీఎం'లా తయారయ్యారు. చంద్రబాబు కోవర్టులా మారిన రేవంత్ ఇక్కడి నీళ్లను ఆంధ్రకు తరలిస్తున్నారు'అని మండిపడ్డారు. 'తెలంగాణలో రైతు రాజ్యాన్ని తెచ్చి, ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దింది ఎవరో ప్రజలకు తెలుసు. అన్నీ తెలిసీ నిజం ఒప్పుకోకుండా నటించడం రేవంత్‌కు మాత్రమే తెలుసు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్యమ నినాదం స్ఫూర్తిని దెబ్బతీస్తూ నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీ కాంగ్రెస్‌కు మళ్లిస్తూ.. కొందరు తొత్తులను రేవంత్ పదవుల్లో నియమించుకున్నారు. ఇందిరమ్మ గొప్పతనం తెలవాలంటే గుడ్డలు ఊడదీసి కొట్టాలి అంటున్న రేవంత్‌కు కాలిపోయిన మోటార్లు, పేలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లు, ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో చెప్పులతో నిలబడటమే ఇందిరమ్మ రాజ్యం అని తెలియదా. ఎమర్జెన్సీ విధించి ఎంతోమందిని అన్యాయంగా జైల్లో పెట్టిన ఇందిరమ్మ రాజ్యం గురించి మాట్లాడితే నిකృష్టంగా ఉంది. మాకు ఓటేస్తే మళ్లీ పాత రోజులు తీసుకొస్తామని చెప్పి.. నిజంగానే ఆ పాత దుర్దినాలను రేవంత్ రెడ్డి తీసుకొచ్చారు. ఎరువులను పంచడం కూడా చేతగాని సీఎం రేవంత్, చర్చకు కేసీఆర్ రావాలని సవాలు చేయడాన్ని చూసి జనం నవ్వుతున్నారు. నాలుగు పంటలకు గాను ఒక్క పంటకు ఒక్కసారి రైతుబంధు వేసి దానికి పండుగ చేసుకోమని రేవంత్ రెడ్డి అనడం సిగ్గుచేటు. ఇవాళ తెలంగాణలోని ప్రతి వర్గం రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాన్ని అర్థం చేసుకుంది. వంద అసెంబ్లీ సీట్లు వస్తాయని రేవంత్ పగటి కలలు కంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏ వర్గం కూడా ఈసారి ఓటేయదు'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఆసుపత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్



బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం ఉదయం సోమాజిగూడ యశోద ఆసుపత్రి డిశ్చార్జ్ అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు పర్యవేక్షించడానికి కెసిఆర్‌ను వైద్యులు ఆసుపత్రిలో చేరాల్సిందిగా సూచించారు. దీంతో ఆయన రెండు రోజులు ఆసుపత్రిలో ఉండి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందారు. సాధారణ వైద్య పరీక్షల నిర్వహణ అనంతరం కెసిఆర్ ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, సోడియం లెవల్స్ కొద్దిగా పెరిగాయని యశోద వైద్యులు నిర్ధారించారు. కాగా, వైద్య పరీక్షల్లో భాగంగా ఒక వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని, ఆ తర్వాత, మరోసారి కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలి ఉంటుందని యశోద వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో.. రానున్న గురు, శుక్ర వారాల్లో వైద్య పరీక్షల నిమిత్తం మరోసారి యశోద హాస్పటల్‌కు అధినేత కెసిఆర్ వెళ్లనున్నారు. ' కాగా..పూర్తి ఆరోగ్యంతో వున్న కెసిఆర్ వైద్య పరీక్షల విరామ సమయంలో రాష్ట్రంలో సాగునీరు, రైతులు, వ్యవసాయం తదితర ప్రజా సమస్యలపై గత రెండు రోజులుగా పార్టీ సీనియర్లతో చర్చిస్తూ సమాచారం తీసుకుంటూ తదనుగుణంగా సూచనలిస్తున్నారు. ప్రస్తుతం కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో డిశ్చార్జ్ అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు. ఆసుపత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్ అయ్యే సమయంలో ఆయన వెంట సతీమణి శోభ, కుమార్తె కల్వకుంట్ల కవిత తదితరులు ఉన్నారు. నందినగర్ నివాసంలో కెసిఆర్‌ను బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గువ్వల బాల్‌రాజ్, జైపాల్ యాదవ్‌లు పరామర్శించారు.

# బాధితులకు భరోసా

రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 29 భరోసా సెంటర్లు ఉన్నాయని, ఈ సెంటర్ల ద్వారా ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితులకు పోలీస్, న్యాయ, వైద్య, కౌన్సిలింగ్ సహాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సిఎం తెలిపారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**చట్టాలు బాధితులకు హాని కలిగించకుండా ఉండాలి**

ఫోక్సో చట్టం, జ్యువనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయని సిఎం రేవంత్ తెలిపారు. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని, ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్‌కు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని సిఎం రేవంత్ సూచించారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరూ తమవంతు సాయం అందించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

**అవగాహన కల్పించడం భేష్ : సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్**

అంతకు ముందు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ తన కీలకోపన్యాసంలో చిన్నారులపై లైంగిక వేధింపులపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం,



ఉమెన్ సెఫ్టీ విభాగం, రాష్ట్ర పోలీసు యంత్రాంగం, రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ సదస్సును అభినందించారు.

**ఆందోళన కరంగా కేసులు : హైకోర్టు సిజె సుజయ్‌పాల్**

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ మాట్లాడుతూ పోక్స్ చట్టం కింద నమోదైన కేసులు గతకొన్ని సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆందోళన కరంగా పెరిగిపోతున్నయన్నారు. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న వారు 98 శాతం కుటుంబసభ్యులు, పొరుగువారు, సమీప బంధువులేనని ఆయన పేర్కొన్నారు. ఇది ఎంతో ఆందోళన కలిగించే అంశం అన్నారు. ఈ కేసులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిందిగా సంబంధిత వర్గాలకు ఆయన సూచించారు.

# మహిళా సాధికారతలో తెలంగాణ టాప్

హైదరాబాద్: మహిళా సాధికారతలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు వచ్చి చూస్తున్నాయన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శనివారం ఆయన ప్రజాభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలసి స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి చెక్కును అందించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తున్న బస్సులకు తొలినెల అద్దె కింద ఈ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు, ప్రోత్సాహకాలను గాలికి వదిలేసిందన్నారు. తాజాగా ప్రజా ప్రభుత్వం మళ్లీ వడ్డీ లేని రుణాలను ప్రారంభించి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలో అవకాశం ఉన్న ప్రతిచోట క్యాంటీన్లు, పాఠశాలల మరమ్మతులు, విద్యార్థుల స్కూల్ డ్రెస్సులు కుట్టడం వంటి పనులను మహిళా సంఘాలకు ఇచ్చి వారిని ఆర్థికంగా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని, అందులో భాగంగా మొదటి సంవత్సరం రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందించామన్నారు. ప్రతీ సంవత్సరం రూ.20 వేల కోట్లకు తగ్గకుండా ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నారు. ఈనెల 12 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజలందరి సమక్షంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. కేవలం వడ్డీ లేని రుణాలే కాకుండా బ్యాంకు లింకేజ్, రుణబీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

**భట్టి సాయంతో మహిళకు కేన్సర్ చికిత్స**

హైదరాబాద్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఓ కుటుంబానికి ఊరట దక్కింది.



ఏపీలోని ఏలూరుకు చెందిన రామకృష్ణ హైదరాబాద్‌లో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆయన భార్య కేన్సర్ లంప్‌తో బాధపడుతున్నట్టు గుర్తించి ఓ ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కొంతకాలం చికిత్స అనంతరం వారు వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో పడ్డారు. ఈ సమయంలో గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని తెలుసుకొని రామకృష్ణ కుమారుడు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలసి లిఖితపూర్వకంగా తన తల్లిదండ్రుల ఆవేదనను వివరించారు. దీనిపై చలించిన భట్టి వెంటనే రామకృష్ణ భార్యకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని తన సిబ్బందిని ఆదేశించారు. సహాయం ఎక్కడా ఆగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. భట్టి ఇచ్చిన లెటర్ ఆఫ్ క్రెడిట్‌తో రామకృష్ణ తన భార్యకు 5 సార్లు కీమోథెరపీ చేయించగలిగారు. కీమో అనంతరం రామకృష్ణ భార్య కేన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి పొందినట్టు వైద్యులు పరీక్షల ద్వారా నిర్ధారించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సాయంతో తన కుటుంబం నిలబడిందని రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో భట్టిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.

## ధర్మయుద్ధం ప్రారంభిస్తున్నాం

హైదరాబాద్: రాష్ట్రంలో అధర్మ పాలన సాగుతోందని.. ఎన్నో హామీలతో మభ్యపెట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్... ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. ప్రజలను వంచించిన అధర్మ ప్రభుత్వంపై ధర్మ యుద్ధాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావు శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అప్పుల కుప్పలు..**

'బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను సర్వనాశనం చేశాయి. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరలోనే రాష్ట్రం పరువును బజారుకీడ్చింది. అప్పులపాలైందంటూ ప్రపంచమంతటా ప్రచారం చేస్తోంది. హామీలు అమలు చేయాలని అడిగితే ఆర్థిక పరిస్థితి బాగో లేదంటూ ప్రజలను మోసగిస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసినప్పుడు హామీలు ఎందుకివ్వాలి? కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు అన్నివిధాలా సాయం అందిస్తోంది. 11 ఏళ్లలో 12 లక్షల కోట్లు రాష్ట్రానికి ఇచ్చింది. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు రాష్ట్రానికి కేంద్రం ఏమీ ఇవ్వలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. కేంద్రం ఏమి ఇచ్చిందో లెక్కలతో సహా వివరాలున్నాయి. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధం'అని రాంచందర్‌రావు చెప్పారు.

**యూరియా కొరత పట్టదా?**

కాంగ్రెస్ పార్టీ ఎల్బీ స్టేడియంలో సామాజిక న్యాయ సదస్సు అంటూ బహిరంగ సభ పెట్టి ప్రధాని మోదీ, బీజేపీని తిట్టడాన్ని రాంచందర్‌రావు తప్పుబట్టారు. సామాజిక న్యాయమంటే మోదీని, బీజేపీని తిట్టడం కాదన్నారు. ఏడాదిన్నరలో ఏం చేశారో చెప్పకుండా చిల్లర మాటలు మాట్లాడారని మండిపడ్డారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని.. కేంద్రం దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపినా రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల, అధికార యంత్రాంగం చేతులెత్తేయడం వల్ల రైతులకు యూరియా అందడంలేదని విమర్శించారు.

**ఏఐసీసీ అంటే ఆలిండియా చీటింగ్ కమిటీ**

బీజేపీ ప్రజల కోసం పనిచేసే పార్టీ అని, కాంగ్రెస్ అధికారం కోసం, అవినీతి కోసం పని చేసే పార్టీ అని రాంచందర్‌రావు ఆరోపించారు. ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చీటింగ్ కమిటీ అని ప్రజలు మాట్లాడుకుంటున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను చూసిన ప్రజలు... ఈసారి బీజేపీకి అవాకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ ధర్మ యుద్ధం చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని ఆయన వ్యాఖ్యానించారు.

**సీఎంకు బహిరంగ లేఖ..**

ఎన్నికల హామీలను కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం బహిరంగ లేఖ రాసి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి గ్యారెంటీని అమలు చేయాలని.. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.



## శ్రీశైలానికి జలకళ

కృష్ణా బేసిన్‌కు వరద ప్రవాహం పెరుగుతోంది. మరోపక్క తుంగభద్ర నుంచి నీటిని విడుదల చేయడంతో తెలంగాణలోని సుంకేసుల బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు సుంకేసుల బ్యారేజీ 12 గేట్లను ఎత్తి దిగువ శ్రీశైలం వైపునకు 50 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అదేవిధంగా ఎగువ కర్ణాటక, మహారాష్ట్రాలలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో జూరాల ప్రాజెక్టుకు లక్షా 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో 14 గేట్లను ఎత్తి 93 వేల క్యూసెక్కులు, విద్యుత్ కేంద్రాల ద్వారా మరో 29 వేల క్యూసెక్కుల వంతున నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలో 24 గంటల వ్యవధిలో ఐదు టిఎంసిల మేరకు నీరు చేరనుంది. ప్రస్తుతం జలాశయంలో 215 టిఎంసిల మేరకు నీరు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలో 215 టిఎంసిలకు గాను 175 టిఎంసిల మేర నీరు నిల్వ ఉంది.

**శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి షురూ..**

శ్రీశైలం కుడి ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైట్ బ్యాంక్ పవర్ హౌస్ ద్వారా 31 వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. అదేవిధంగా తెలంగాణకు చెందిన లెఫ్ట్ బ్యాంక్ పవర్ హౌస్ ద్వారా 35 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ఏపి పవర్ హౌస్ ద్వారా 16.187 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా తెలంగాణకు చెందిన లెఫ్ట్ బ్యాంక్ పవర్ హౌస్ ద్వారా 17.2341 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.

**నాగార్జునసాగర్‌కు వరద**

శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుండడంతో అధికారులు కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్‌కు 67 వేల క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ వైపునకు వదులుతున్నారు. మరో మూడు రోజుల పాటు శ్రీశైలం జలాశయానికి లక్ష క్యూసెక్కుల మేరకు వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నట్లు శ్రీశైలం ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే మోతాదులో వరద కొనసాగితే మరో మూడు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం

హైదరాబాద్
ఆదివారం, 6 జూలై 2025



## ఐక్యతతోనే రాజ్యాధికారం

### మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తం రావు

హైదరాబాద్: జూలై 5 ( వాయిస్ టూ డే): ఐకమత్యమే బలం, మనమందరం మరింత ఐక్యతతో రాజ్యాధికారం వైపు వడివడిగా అడుగులేద్దామని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్ధార్ పుటం పురుషోత్తమ రావు పటేల్, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మలు పిలుపునిచ్చారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.రామ్మోహన్ రావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇతర బీసీ కులాల వారితో స్నేహంగా ఉంటూ రాజ్యాధికారమే లక్ష్యంగా, ధ్యేయంగా, క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో ముందుకు సాగుదామన్నారు. సంఘం నూతన అధ్యక్షుడుగా పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శిగా పెంటయ్య, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా బండి పద్మక్కలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం అంబర్ పేట మున్నూరుకాపు ప్రముఖులు అలీ కేఫ్ సమీపాన ఉన్న కృష్ణారెడ్డి ఫంక్షన్ హాలులో గజమాలలు, శాలువాలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి. రామ్మోహన్ రావు, రాంపల్లి జైహింద్, బోనం వీరబాబు, సిహెచ్ శ్రీనివాస్, చెంగలి చంద్రమోహన్, మిరియాల శ్రీనివాస్, శ్రీధర్, ఉప్పు సత్యనారాయణ, పలువురు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా రామగిరి ప్రభాకర్ జన్మదిన వేడుకలు

### అనాథ పిల్లలకు సాయం చేయడం ఆదర్శనీయం: రామగిరి ప్రభాకర్

### చిన్నారులకు బ్లాంకెట్లు, జ్యూస్ ప్యాకెట్ల పంపిణీ

సికింద్రాబాద్, జూలై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ నియోజకవర్గ సీతాఫల్మండి డివిజన్ ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్త రామగిరి ప్రభాకర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనాథ పిల్లలకు సహాయం చేయడంలో ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో స్పందించాలని పలువురు ఈ సందర్భంగా ఆయన అన్నారు. శుక్రవారం రాత్రి 200 మంది పైగా అభాగ్యులైన యాచకులకు బ్లాంకెట్లు,



జ్యూస్ ప్యాకెట్ల పంపిణీ స్వయంగా ఆయన చేతుల మీదుగా అందించారు. అనంతరం శనివారం బన్సీలాల్‌పేట కృష్ణానగర్ కాలనీలోని ఆక్సిలియం నవజీవన అనాథ బాలిక ఆశ్రమంలో శనివారం చిలకలగూడకు చెందిన రామగిరి ప్రభాకర్ చిన్నారి బాలికలకు బ్లాంకెట్లు, జ్యూస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చిన్నారుల అవసరాల మేరకు భవిష్యత్తులో మరింత సహాయం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బగ్గ హనుమంతరావు, సీనియర్ జర్నలిస్టులు పుల్లూరి మహేందర్, కోటేశ్వరరావు రామగిరి దయాకర్, శ్రీకాంత్,రవిశంకర్, బాలిక ఆశ్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## తార్నాక స్ట్రీట్ నెంబర్ 5 సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్‌కు వినతి



సికింద్రాబాద్, జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): తార్నాక స్ట్రీట్ నెంబర్ 5లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా మురుగునీరు సమస్య నిత్య కృత్యంగా మారిందని కాలనీవాసులు చెప్పారు. ఈ మేరకు శనివారం తార్నాకలోని నగర డిప్యూటీ మేయర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా మురుగునీరు నిత్యం రోడ్లపై ప్రవహిస్తూనే ఉందన్నారు. కాలు తీసి కాలు పెట్టాలన్న కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కంపుతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని పేర్కొన్నారు. తార్నాక ప్రధాన రహదారిలో ఉన్న దుకాణ సముదాయాలు, టిఫిన్ సెంటర్లు, హొటల్ల నుండి వచ్చే డ్రైనేజీ వ్యర్థాల కారణంగా మురుగు నీరు రోడ్ల పైకి చేరే తమ కాలనీలోని పారుతుందన్నారు. ఇష్టా రాజ్యాంగ నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్ల, హొటల్ ల వల్ల మురుగు నీరు రోడ్ల మీద పొంగి ప్రవహిస్తుందన్నారు. దీని ద్వారా పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి, వృద్ధులు, చిన్నపిల్లలకు సీజన్ సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రధాన రహదారిలో ఉన్నటువంటి షాపులు, హొటల్స్ , టిఫిన్ సెంటర్ వాళ్ళకు ఎన్నోసార్లు విన్నవించిన పట్టించుకో లేదన్నారు. ఈ సమస్యపై జిహెచ్ఎంసి అధికారులకు, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ తో పాటు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో కూడా పిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తార్నాక స్ట్రీట్ నెంబర్ 5 లోని షాప్ యజమానులు రుద్రవరం వెంకటేశ్వర చారి, ఉత్తమ కుమార్, రామారావు, వెంకట్రావు, విజయ్, శివకుమార్ ,జానకిరామ్, రమేష్ ,రేణుక, లావణ్య, ఓంకార్, సత్య ,శర్మ, విటల్ రావు ,సాయి ,శివ తదితర దుకాణ యజమానులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఔట్ సోర్సింగ్ విధానం ఎత్తివేసి యూనివర్సిటీ ఉద్యోగులను పర్మినెంట్ చెయ్యాలి

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ



సికింద్రాబాద్, జూలై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సిఐటి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ధర్నా నిర్వహించింది. బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించింది. ఈ సభకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ హాజరై మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం యూనివర్సిటీలకు గ్రాంట్స్ విడుదల చేయకుండా యూనివర్సిటీల ను నిర్వీర్యం చేస్తుందని, పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ బడా కంపెనీలకు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నారు. కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు యూని వర్శిటీలలో కూడా విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రమాదకర లేబర్ కోడులు కార్మికులకు కట్టు బానిసల్ల తయారవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని తీసేసి 12 గంటల పని ఎవరు ప్రయోజనాల కోసం తీసుకొస్తున్నారని విమర్శించారు. అల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ విధానం మన దగ్గరే కాదు రాష్ట్ర మంతటా ఉన్నదనీ, దాని వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దిని పై మనం ఐక్యంగా పోరాడాలన్నారు. లేకపోతే మన హక్కులను మనం కాపడుకొలేమని చెప్పాను. ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగులు దాదాపు 30 సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు, సంవత్సారాలు గడుస్తున్న వీరిని ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించటం లేదని అవేదన వ్యక్తం చేశారు, వెంటనే అందరిని ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజా కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. జాతీయ సహజ వనరులు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతుందని, విధంగా తన విధానాలను అమలు చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. బిజెపి కేంద్ర సర్కార్ ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్, పెన్షన్ నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ న్యాచురల్ ఫండ్ సంస్థలకు అప్పచెప్పుతున్నదని అన్నారు. అనేక త్యాగాలు రక్తర్పన చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మారుస్తూ పార్లమెంటులో చట్టం చేసిందన్నారు. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడిందనీ, పారిశ్రామిక సంబంధాల బిల్లు చట్టంతో సమ్మెకును కాలరాస్తుందన్నారు. అలాగే తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి చేస్తున్నదనీ, కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాలలో మరింత పెరిగి దోపిడీకి హద్దే లేకుండా పోతుందని అన్నారు. సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ లేబర్ కోడ్ లతో బానిసత్వంలోకి నెట్టేటువంటి ప్రమాదం ఉందన్నారు. ప్రజల సమస్యలను రోజురోజుకు తీవ్రతరం చేస్తూ మళ్ళీ అధికారంలోకి రావాలని ఉవ్విళ్ళు ఊరుతోందని ఎద్దేవా చేశారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాకుండా మరింత పేదలు గా కార్మిక వర్గం బానిసత్వంలో వెళ్లేటు వంటి ప్రమాదం ఉందని వీటన్నిటిని ప్రతి ఘటించేందుకు జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని, బీజేపీ వ్యతిరేక విధానాలకు వ్యతరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు దశరథ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు శ్రీను, నాగరాజు, సహాయ కార్యదర్శులు వీరేష్, పోచయ్య, అంజమ్మ, కిషోర్, కుమార్, ఈశ్వరయ్య, ప్రమీల, అరుణ, ఐలమ్మ, వీరేశం,సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర బిజెపి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ రామచంద్రరావు

### ఘనంగా సత్కరించిన అంబాల రాజేశ్వరరావు...

సికింద్రాబాద్, జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా నియమితులైన ఎన్ రామచంద్రరావు శనివారం నాంపల్లిలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు తార్నాకలోని తన నివాసం నుండి రామచంద్ర రావు ర్యాలీగా బయలుదేరగా బిజెపి సీనియర్ నాయకులు అంబాల రాజేశ్వరరావు నేతృతంలో బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి భారీ గజమాలతో సత్కరించారు. ర్యాలీకి ముందు భారీ క్రాకర్స్ కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అంబాల రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృతంలో తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు ఆధ్వర్యంలో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పార్లమెంట్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో బూత్ స్థాయి నుంచి బిజెపిని బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు శ్రేణులు మహిళలు భారీగా పాల్గొన్నారు.

## యువత సహకార రంగం వైపు మళ్ళే విధంగా కృషి: మనాల మోహన్‌రెడ్డి



సికింద్రాబాద్, జూలై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): రాబోయే కాలంలో యువత సహకార రంగం వైపు మళ్ళే విధంగా కృషి చేస్తున్నామని టిజిసియు చైర్మన్ మనాల మోహన్రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కో ఆపరేటివ్ యునియన్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బేగంపేట ప్రభుత్వ డీగ్రీ కళాశాల, నిజాం కళాశాల విద్యార్థులకు నెల రోజులపాటు సహకార సంఘాలు వాటి ప్రాధాన్యతపై శిక్షణ ఇచ్చిన అనంతరం వారికి సర్టిఫికెట్, మెమోంటోలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మనాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో సహకార రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి 2025ను కో ఆపరేటివ్ సంవత్సరంగా ప్రకటించిందని గుర్తుచేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి యువత సహకార రంగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్టర్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటిస్ తెలంగాణ, కో ఆపరేషన్ కమిషనర్ కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ, ప్రజల మధ్య ఉన్న అగాధాన్ని తొలగించేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగానే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చే తరాన్ని సహకార వ్యవస్థ వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకుంటాన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ రిజిస్టర్ గురుజాల శ్రీనివాసరావు, టిజిసియు ఎండి కెవిఎన్ అన్నపూర్ణ, నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్ ఎవి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

### సమగ్ర సాంస్కృతిక విధానం తీసుకురావాలి....

### జానపద అకాడమీ ఏర్పాటు చేయాలి....

### తెలంగాణ జానపద సకల కళల కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ.....

### కళాకారుల సమస్యలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది....

### మంత్రి జూపల్లి కృష్ణారావు...




సికింద్రాబాద్, జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ కళాకారుల సమస్యలు పరిష్కరించాలని, వెంటనే సమగ్ర సాంస్కృతిక విధానం తీసుకురావాలని, జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని తెలంగాణ జానపద సకల కళల కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జానపద సకల కళల కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో రవీంద్రభారతి లో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుల కార్యాలయం వద్ద కళాకారులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, జానపద కళాకారుల జాక్ చైర్మన్ మురళీధర్ దేశ్పాండే పాల్గొని మాట్లాడారు. 11 ఏళ్లుగా తెలంగాణ ప్రభుత్వాలు కళాకారుల సమస్యలు చర్చించేందుకు ముందుకు రాలేదని తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం లో కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గుర్తిపు కార్డు ఇవ్వాలని, కళాకారులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాకారులకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రవీంద్రభారతి లో ప్రజా కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు పాలకులు కళాకారులను ఉపయోగించుకుని కరివేపాకు లా తీసివేసినారని అన్నారు. దీనజనోద్ధరణకే తాము పుట్టినట్లుగా పోజులు పెట్టి అడ్డగోలుగా హామీలిచ్చి పదువులలోకొచ్చి పేద కళాకారులను ఉద్యమకారులను, గ్రామీణ జానపద యక్షగాన కళాకారులను వాడుకోవడం తప్ప కళాకారులను ఆదుకోవడంలో 12 ఏళ్ల పాలకుల పాపమే కళాకారుల శాపమైందన్నారు. న్యాయం చేసేదెవరు? పాలకులంతా ఒకే తాను గుడ్డలే అని రుజువైందన్నారు. కళాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంటే భాషా సాంస్కృతిక శాఖ 11 ఏళు ్లగా నియంతృత్వం కోనసాగుతుందని ఇలా ఉండడాన్ని ఉపేక్షించిన ఈ ప్రభుత్వాలదే తప్పు అని అన్నారు. తక్షణమే వారిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 11 ఏళ్లుగా సంక్షేమం ఎరుగని కళాకారులుఅని అన్నారు.తక్షణమే సమస్యలు చర్చించేందుకు ముందుకు రావాలని కోరారు. అందుకు తెలంగాణ ప్రోహిభిషన్ %ఎ% ఎక్సైజ్ పర్యాటక , బాషా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కి వినతి పత్రం అందజేశారు. కళాకారుల సమస్యలు విన్న మంత్రి త్వరలో తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం పై తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు పింఛన్లు మంజూరు చేస్తామని, కళాకారుల సమస్యలు చర్చించేందుకు ప్రభుత్వం నుండి చోరవతీసుకుంటానని అన్నారు. కళాకారులకు సత్వర న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తానన్నారు. మాజీ యంఏల్ఎ కటకం మృత్యుంజయ మాట్లాడుతూ కేరళ, కర్ణాటక లా జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని, తెలంగాణ సినిమాను రూపుదిద్దాలని, హైదరాబాద్ ఫిలిం ఫెస్టివల్ తెలంగాణ ఫిలిం ఆర్కేవ్స్ నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కృషి చేయాలని అన్నారు. తెలంగాణ లో ఆగష్టు 22 న జానపద దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కళాకారులు హాజరయ్యారు.

# ప్రజా సంక్షేమ దైవ సత్సంగ్ చాతుర్మాస కమిటీ ఆధ్వర్యంలో ప్రవచనాలు

## హాజరుకానున్న సంత్ గురుదేవ్ శ్రీ లలిత్ ప్రభుజీచే ప్రవచనాలు



కంటోన్మెంట్: జులై 5 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రపంచ శాంతి, మానవ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడంతో పాటు లోక కళ్యాణార్ధం లోక కళ్యాణకారి దివ్య సత్సంగ చాతుర్మాస సమితి ఆధ్వర్యంలో 2025 చతుర్మాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చాతుర్మాస్ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్ జోద్ పూర్ నుండి క్రాంతికారి ఔజస్వి ప్రవచన కారుడు గురు లలిత్ ప్రభువు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సత్సంగ కార్యక్రమాల కోసం జోద్ పూర్ నుండి లలిత్ ప్రభుజి ఆయన శిష్య బృందంతో కాలినడకన పాదయాత్ర చేస్తూ 1600 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నట్లు చాతుర్మాస్ ప్రతినిధులు పేర్కొన్నారు. రేపు ఉదయం ఎగ్జిబిషన్ మైదానంలో లోక కళ్యాణకారి దివ్య సత్సంగ ప్రవచనాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జైన సమాజంతోపాటు ఉత్తర భారతీయులంతా పెద్ద ఎత్తున ఈ సత్సంగ కార్యక్రమాలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గురు లలిత్ ప్రభు మాట్లాడుతూ రెండు నెలల పాటు ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే ప్రవచన సత్సంగంలో ప్రజలకు సందేశం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ప్రవచనాల మూలంగా మానవ జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, సాంస్కృతిక ధార్మిక పరిరక్షణ, నైతిక విలువలు పెంపొందేందుకు దోహదపడతాయని అన్నారు. మానవ జీవనంలో సమాజం, తల్లిదండ్రులు, కుటుంబాల అంశాలపై కూడా ప్రవచనాలు ఉంటాయని రెండు నెలల పాటు అనేక అంశాలను ప్రవచనాల రూపంలో అందించనున్నట్లు తెలిపారు. దివ్య సత్సంగ ప్రవచనాలను ఆర్ విభాగాలుగా విభజించి ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు తెలిపారు. సానుకూల మానవ జీవన నిర్మాణ శైలి , జీవనంలో ప్రగతి సాధించేందుకు వ్యక్తిత్వ వికాసాన్ని ఎలా పెంపొందించుకోవాలనే అంశాలతో పాటు కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసాన్ని క్రోడీకరించుకుని జీవనగమనంలో ముందుకు వెళ్లే విధంగా అనేక ప్రవచనాలు ఉంటాయని అన్నారు. చతుర్మాసంలో 30 రోజులపాటు యోగా సాధన, ధ్యానం, ప్రాణాయామం,మితభోజనం వంటి అనేక క్రియల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మోతిలాల్ బాల ఘూట్ వైస్ చైర్మన్ ఉమేష్ భాగ్రేచా, అధ్యక్షుడు ప్రదీప్ సురానా ప్రధాన కార్యదర్శి అశోక్ సహార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సు, భూభారతి, కొత్త రేషన్ కార్డులు సమస్యల పరిష్కారం కోసం చర్యలు

### :- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- రెవెన్యూ సదస్సు, భూభారతి,కొత్త రేషన్ కార్డులు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. శనివారం రోజు జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల తాసిల్దార్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు.జిల్లాలో ఇప్పటి వరకు రెవెన్యూ సదస్సులో జిల్లాలో మొత్తము 17 మండలాల్లో 301 రెవెన్యూ గ్రామాల్లో 14,918 దరఖాస్తులు వచ్చాయని. వాటిలో 4203 దరఖాస్తులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని. 1819 దరఖాస్తులను డిస్పోజల్ కాగా, 361 దరఖాస్తులను అధికారులు అంగీకరించారు. ఈనెల 8వ తారీఖున విచారణ పూర్తి చేసి, జూలై 31 లోగా దరఖాస్తులపై పూర్తి విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూభారతి కింద 3129 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి, వీటిని వారం రోజుల్లోగా పరిష్కరించాలని తహసీల్దార్, ఆర్డీవోలను ఆదేశించారు. జిల్లాలో కొత్తగా 10690 రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. మరో 651 దరఖాస్తులు విచారణ కొనసాగుతుందని ఈనెల 10వ తేదీ వరకు కొత్త రేషన్ కార్డులను పరిష్కరించాలని ఆగష్టు, 14 తేదీ వరకు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేయాలన్నారు. ఎన్ఎఫ్బిఎస్ పథకం కింద కుటుంబంలో ఎవరైనా పెద్దలు చనిపోయిన పక్షంలో రూ.20 వేల ఆర్థిక సహాయం అందుతుంది. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 626 దరఖాస్తులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ జూమ్ మీటింగ్ లో రెవెన్యూ డివిజన్ అధికారులు,మండల తాసిల్దార్లు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలి

### - యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో తాజా కూరగాయలతో విద్యార్థులకు మంచి రుచికరమైన ఆహారాన్ని అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని రాజాపేట కి సంబంధిచిన మహాత్మా జ్యోతిబా పూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఉండే కిచెన్ ని తనికి చేసి కిచెన్ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈరోజు మెనూ ప్రకారం విద్యార్థులకి పెట్టే భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం రుచి కరంగా విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. కిచెన్‌లో ఉన్న కూరగాయల్ని పరిశీలించి నాణ్యత సరిగ్గా లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లకి కి చెప్పి ఎప్పటికప్పుడు తాజాగా అన్ని రకాల కూరగాయలు తీసుకొచ్చి వండాలన్నారు. హాస్టల్ లో నీటీ సదుపాయం కోసం మిషన్ భగీరథ ట్యాంక్ కావాలని పాఠశాల ప్రిన్సిపాల్ అడగటంతో వెంటనే కలెక్టర్ సంబంధిత అధికారికి ఫోన్ చేసి వెంటనే ట్యాంక్ నిర్మించాలని ఆదేశించారు.

# జర్నలిస్టుల పట్ల పాలకుల వివక్షను ప్రతిఘటిద్దాం

- సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు
- దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



వరంగల్,జూలై 05: జర్నలిస్టుల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని,ఈ వైఖరిని జర్నలిస్టులు ప్రతిఘటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరవుస్తున్నా.. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం వరంగల్ లోని కెమిస్ట్రీ భవన్ లో టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా తృతీయ మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జన చైతన్య యాత్ర చేస్తామని, ప్రజల మద్దతు కోరతామని ప్రకటించారు. సమస్యలపై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో మెజారిటీ జర్నలిస్టుల జీవన స్థితిగతులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా మండలస్థాయి విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టులకు అన్యాయం చేశాయని ఆయన విమర్శించారు. జర్నలిస్టులందరికీ ఉపయోగపడాల్సిన మీడియా అకాడమీని ఆ యూనియన్ లు తమ జేబు సంస్థగా మార్చుకున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఏం ఒరిగిందని, ఏం మేలు చేశారని పాలకులు, జర్నలిస్టు సంఘాలు సంబరాలు జరుపుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకున్నట్టు జర్నలిస్టుల పేరు చెప్పి అధికార పదవులు పొంది పాలకులకు ఊడిగం చేస్తూ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటి జర్నలిస్టు సంఘాల పట్ల యావత్ జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, రాష్ట్రంలో చాలా ఏళ్ళుగా నడుస్తున్న అనేక చిన్న పత్రికలను ప్రభుత్వం గుర్తించకుండా అణచివేస్తున్నదని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న అన్ని చిన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలన్న నిబంధనను పాలకులు తుంగలో తొక్కి దొడ్డిదారిన పైరవీలకు ప్రాధాన్యమిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని గుర్తించి జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఇతర సంఘాల నుంచి పెద్దఎత్తున టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మూడు మాసాల్లో అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్,రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫెడరేషన్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం జర్నలిస్టుల సమస్యలపై నిరంతం పోరాడుతూ, జర్నలిస్టులకు అండగా ఉంటుందని వారన్నారు.

విలేకరులు పాలకుల ముందు తలవంచకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని అన్నారు. జర్నలిస్టులు పాలకులకు ఊడిగం చేయాల్సిన అవసరం లేదని, ప్రజల పక్షాన నిలిచి ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జర్నలిస్టులకు అండగా ఉంటుందని, సభ్యులందరు సమిష్టిగా ఉండాలని అన్నారు. సీనియర్ జర్నలిస్టు, ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో స్థానిక కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్, ఫెడరేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి బొట్ల స్వామిదాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొలుమారి గోపాల్, చుంచు అయిలయ్య, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, జనగామ జిల్లా అధ్యక్షుడు నీల నరేష్ బాబు, సీనియర్ జర్నలిస్టు సానిక్ తదితరులతో పాటు వివిధ పత్రికలు,చానళ్ళకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పరిశ్రమల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

### సి.ఐ.టి.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

సికింద్రాబాద్, జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలనీ, కార్మిక చట్టాలను నీరు కార్చువద్దని సి.ఐ.టి.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సూచించారు. శనివారం బాగ్ లింగం పల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వం, యాజమాన్యం బాధ్యత వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలడుగు భాస్కర్ హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గానీ ఎన్నడూ జరగనటువంటి పారిశ్రామిక ప్రమాదాలు ఇటీవల కాలంలో జరిగాయన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని "సిగాచి" ఫార్మా కంపెనీలో 2025 జూన్ 30న జరిగిన పేలుడు ఘటనలో 41 మంది మరణించగా, 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారనీ, 5 రోజులు గడిచినప్పటికీ 10 మంది కార్మికుల ఆచూకీ దొరకక వారి కుటుంబ సభ్యులు విలవిల్లాడుతున్నారన్నారు. క్షతగాత్రులకు ఎక్కడ వైద్యం అందిస్తున్నారో తెలియక ఇబ్బందులు పడుతున్నారనీ, ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి పరిహారం ప్రకటించి, ఆపన్నహస్తం అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పని చేయలేదని అన్నారు. పరిశ్రమ యాజమాన్యం చేత కోటి రూపాయలు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి ప్రకటన చేశారనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు.



## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే ముఠా గోపాల్...

### 85 లక్షలతో బోలక్పూర్ లో రోడ్ల ఆధునీకరణ....

సికింద్రాబాద్, జూలై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రజల అవసరాలను తీర్చేందుకు రాజకీయాల కు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ చెప్పారు. శనివారం భోలక్పూర్ డివిజన్లోని బంగ్లాదేశ్ మార్కెట్, సిద్ధిక్ నగర్ లో చేపట్టిన సి సి రోడ్డు నిర్మాణ పనులను జిహెచ్ఎంసి డి.ఈ సన్నీ తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్య వేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోల క్పూర్ లో దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు అధ్వానంగా మారడంతో వాటిని ఆధునవీ కరించేందుకు 85 లక్షలతో సిసి రోడ్లు వేశామని అన్నారు. నగరంలో చార్మినార్ ను తలపించే విధంగా బంగ్లాదేశ్ మార్కెట్లో వస్త్ర వ్యాపారం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఆధునిక సిసి రోడ్లు వేసామని తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజ్, వాటర్ పైప్ లైన్ పనులు పూర్తి చేశామని తెలిపారు. స్థానికులు వ్యాపారులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. అనంతరం పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై శ్రీనివాసరావు, బిఆర్ఎస్ నాయకులు రహీం, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, చాంద్ పాషా, ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్ , జునైద్ బాగ్దాది , మున్వర్ చాంద్,ఆర్ శ్రీనివాస్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు మక్బూల్, జబ్బర్ యూత్ కమిటీ అధ్యక్షుడు సాయికుమార్ నాయకులు మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, అజి పాషా, గోవింద్, ఆరిఫ్,సునీల్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం

### నూతన జిల్లా కన్వీనర్, కోకన్వీనర్ల ఎన్నిక....

సికింద్రాబాద్, జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం రోజు వేముల యాదగిరి, కాంపల్లి సాయిలు అధ్యక్షతన చిక్కడపల్లిలో ని కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, కోశాధికారి చందన ప్రసాద్, ఉద్యమ విద్యార్థి జెఎసి అధ్యక్షులు కంచర్ల బద్రి, మహిళా వేదిక ప్రధాన కార్యదర్శి లావణ్య లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల లకు కమిటీ కన్వీనర్లను ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా కన్వీనర్ గా కోయ్యాడ రాజేష్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ గా స్వరూపారాని, బాల లక్ష్మమ్మ, గజ్వేల్ జిల్లా కన్వీనర్ గా యాదగిరి, చంద్రకళ, నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్లుగా కాంపల్లి సాయిలు, మాడుగుల వెంకటయ్య, మెదక్ జిల్లాకు కొండలు యాదగిరి, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా రేణుక, భువనగిరి జిల్లా కన్వీనర్ గా సుగుణమ్మ, లావణ్య, రంగారెడ్డి జిల్లాకు ఇందిర లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల నుంచి ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు సహకరించాలి

### తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి

తొర్రూరు, జులై 5 వాయిస్ టుడే : తొర్రూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ప్రతి డ్రైవర్ వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించి అత్యధిక కెఎంపియల్ తీసుకొచ్చి డిపో అభివృద్ధికి సహకరించాలని తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి కోరారు. శనివారం తొర్రూరు డిపోలో అత్యధిక కెఎంపిఎల్ తెచ్చిన డ్రైవర్లకు ప్రోత్సాహక చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్ డి.రాంచంద్ అత్యధిక కెఎంపిఎల్ తెచ్చి మొదటి స్థానం,డ్రైవర్ వి. నర్సయ్య రెండవ స్థానంలో నిలిచారని తెలిపారు.డిపో అభివృద్ధికి ప్రతి డ్రైవర్ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్టిఐ రజిత రెడ్డి, ఎంఎఫ్ విజయ్ కుమార్,ఎంసి గోపాల్ రెడ్డి,డిపో ఉద్యోగులు తదితరు పాల్గొన్నారు.



## స్వర్గీయ కొల్లూరి రిషినంద్ 32వ జయంతి కార్యక్రమం

వరంగల్ ( వాయిస్ టుడే ) జులై 05: నగరంలోని రంగసాయిపేటకు చెందిన స్వర్గీయ కొల్లూరి రిషినంద్ 32 జయంతిని పేద వృద్ధుల సమక్షంలో శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిషి నంద్ జయంతి నీ పురస్కరించుకొని రిషినంద్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కొల్లూరి యోగానంద్ కన్నతల్లి ఫౌండేషన్ వారికి బియ్యం బస్తా తో పాటు నిత్యావసర వస్తువుల కోసం 3000 రూపాయలు అందించారు. ఈ సందర్భంగా రిషి నంద్ ట్రస్ట్ చైర్మన్ యోగా నంద్ మాట్లాడుతూ కన్నతల్లి ఫౌండేషన్ వాళ్లు చేస్తున్న కార్యక్రమాలు పేద వృద్ధుల కోసం చేస్తున్న సేవలు తన కు నచ్చాయని కన్నతల్లి ఫౌండేషన్ కి తమ వంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కొల్లూరి యోగానంద్ స్వరూప, తుషిత్ నందన్, జోషిక నాథ తో పాటు డాక్టర్ శివకుమార్, రచన శ్రీ, కత్తి ఎల్లా గౌడ్ ,మాచర్ల దీన్ దయాల్, చిన్నారావు, మంద బాబురావు, పోలేపాక జనార్ధన్, లింగమూర్తి, సుదర్శన్, కొండమీద రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావును సన్మానించిన బిజెపి నాయకులు



వరంగల్ ( వాయిస్ టుడే ) జూలై 05: తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు గా భాధ్యతలు స్వీకరించిన యన్.రాంచందర్ రావు ను జిల్లా బిజెపి నాయకులు శనివారం కలువడం జరిగింది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్ రాంచందర్ రావు నూతనంగా బాధ్యత లు చేపట్టిన సందర్బంగా హైదరాబాద్ రాష్ట్ర పార్టీ కార్యాలయం లో వరంగల్ జిల్లా బిజెపి నాయకులు గందె కల్పన నవీన్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు రైల్వే జెడ్ ఆర్ ఆర్ యు సి సి నెంబర్ ఎరుకల రఘునాథ రెడ్డి ఇరువురు అయన ను మర్యాద పూర్వకంగా కలసి శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్ & స్కాలర్ షిప్స్ లను విడుదల చేయాలి

**-సమస్య తో యాజమాన్యాలు, విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు**

**-ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్**




భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం లో నగరం లోని పోచం మైదాన్ జంక్షన్ లో గత ఆరు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ నిధుల ను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్,స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు విద్యార్థులు, ప్రైవేటు యాజమాన్యాలు, తీవ్ర ఇబ్బందులు ఏదుర్కోంటున్నారు. వడ్డీలు తెచ్చి మేం విద్యాసంస్థలను నడపలేము అని పరీక్షలు బాయ్ కాట్ చేశారు. ఇంకోపక్క విద్యార్థులు నుండి పెండింగ్ ఫీజులను బలవంతపు వసూళ్లు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. కాంగ్రెస్ గత పాలకుల నిర్లక్ష్యంను విమర్శించి వారు అధికారంలోకి వస్తే ఫీజు రీయంబర్స్ మెంట్స్ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిందని ఈ పథకాన్ని మరింత పటిష్టమైన పథకంగా రూపోందించి బకాయిలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 13లక్షల మంది విద్యార్థులు బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు పై చదువులకు వెళ్ళాలంటే సర్టిఫికేట్స్ కోసం కాలేజీలు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోన్ని కళాశాలలు కూడా ముక్కు పిండి మరి వసూళ్లు చేస్తున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేయాలని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజులను విడుదల చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగింపు ఉద్యమం ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు జిల్లా మహేష్ ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేందర్ నితిన్ సుకుమార్ అన్వేష్ అభినయ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు

# అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్( వాయిస్ టుడే ) 5 జూలై : అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని మరొక వ్యక్తికి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్ దాన్ మహాదానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ, టీ 9 ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని అబ్బాస్ ఫంక్షన్ హాల్ లో నేత్ర అవయవ శరీర దానం పై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ముఖ్య అతిథిగా పాల్గొని, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాలలో వెలుగు నింపవచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కలగాలని చెప్పారు. అవయవదానం చేసిన వారు మహాత్ములని, చిరంజీవులుగా మిగిలిపోతారని సూచించారు.

ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో వైద్య విద్యార్థులు మానవ శరీరం పై ఫిజియాలజీ, అనటమి పరీక్షలు ఆచరాత్మకంగా చేయుటకు మానవ మృత దేహల అవసరం ఎంతో ఉందని, మానవ మృత దేహలు దానం చేయడం వల్ల వీటిని వినియోగించి మంచి వైద్యులను తయారు చేయ వచ్చునని కలెక్టర్ తెలిపారు. మనిషి చనిపోతే ఇక తిరిగి రారు, ఇక లేరు అనుకుంటారని, కానీ ఒక బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుండి 8 మందికి కొత్త జీవితాన్ని ఇస్తుందన్నారు. వేల మంది రోగులు తమకు అవసరమైన అవయవాలు సరైన సమయంలో లభించకపోవడంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రక్తదానం చేసే విధంగానే ప్రతి ఒక్కరూ అవయవనానికి సైతం ముందుకు రావాలని కోరారు. జీతే జీతే రక్తదానం జాతే జాతే నేత్రదాన్, దేహ్ దాన్ చేయాలన్నారు.

రోగిని బ్రతికించే వాళ్ళు డాక్టర్లు దేవతలైతే అవయవ దానం చేసిన వారు దైవదూతలన్నారు . అవయవ దానం పై అవగాహన కార్యక్రమాలను ఉదృతం చేయాలని కలెక్టర్ కోరారు. దాతలకు అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు, నిర్వాహకులు, అధికారులు వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, మాట్లాడుతూ అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తాము కూడా వైద్య విద్యార్థులుగా విద్యానభ్యసించిన సమయంలో మానవ మృతదేహాలపై ప్రాక్టికల్గా పరీక్షలు నిర్వహించడం వల్ల ఈరోజు సమాజంలో రోగులకు పరిపూర్ణంగా శస్త్ర చికిత్సలు చేయగలుగుతున్నామన్నారు నేటి వైద్య విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ గా శస్త్ర చికిత్సలు నేర్పడానికి మానవ పార్థివ దేహాలు ఎంతో అవసరమని అన్నారు. అవయవ దానం చేయుటకు అంగీకరించడం, బ్రెయిన్డెడ్ అయిన వారి శరీరాలను ముందుకు వచ్చి మెడికల్ కాలేజీలకు ఇవ్వడం మంచి పరిణామం అని, దీని ద్వారా గొప్ప డాక్టర్లను తీర్చిదిద్దడంతో పాటు దైవం కూడా అనుగ్రహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అవయవ దానం చేయుటకు అంగీకరించిన వారికి శాలువాలతో కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు కేఎంసీ, ఎంజీఎం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్లు డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి డాక్టర్ చిలుక మురళి డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ కూరపాటి రమేష్, ప్రభుత్వ సూపర్డెంట్ డాక్టర్ భరత్ కుమార్, మైదం రాజు తహసీల్దార్ ఇక్బాల్, నిర్వాహకులు, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి

### వేములవాడ అర్బన్లో విషాదం



వాయిస్ టుడే ప్రతినిధి, వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా: వేములవాడ అర్బన్ మండలంలోని చింతల ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇంటి ముందు ఆడుకుంటున్న రిషి (4) అనే చిన్నారి అకస్మాత్తుగా ఇంటి సమీపంలోని నీటి సంపులో పడిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పిల్లాడి అరుపులు ఎవరికీ వినిపించకపోవడంతో, కొన్ని క్షణాల తరువాత గమనించిన కుటుంబ సభ్యులు అతడిని బయటకు తీశారు. అయితే అప్పటికే శ్వాస ఆగిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారి మరణ వార్తతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో రిషి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సంఘటనపై సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికైన జ్ఞాన దీప్ విద్యార్థిని



వాయిస్ టుడే ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట/ రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జ్ఞాన దీప్ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన పెరుమాండ్ల సుస్వర బాసర ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండంట్ మిట్టపల్లి లక్ష్మి నారాయణ తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో మండల ర్యాంకులు సాధిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు ట్రిపుల్ ఐటి కి ఎంపికైన సుస్వర ను అభినందించారు. విద్యార్థుల అభివృద్ధికి కృషిచేస్తున్న ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఓపెన్ స్లాబ్ లో నిర్వహిస్తున్న చతుర్వేద స్మార్త పరీక్షలను పరిశీలించిన ఆలయ ఈఓ రాధ భాయి



వాయిస్ టుడే ప్రతినిధి, వేములవాడ/ రాజన్న సిరిసిల్ల జిల్లా: శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వేములవాడ కు సంబంధించిన శ్రీ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు వేద పాఠశాల ఆధ్వర్యంలో తేది: 03-07-2025 నుండి తేది: 06-07-2025 వరకుఓపెన్ స్లాబ్ యందు నిర్వహిస్తున్న శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిలభారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు చతుర్వేద స్మార్త పరీక్షలను ఈరోజు ఆలయ ఈఓ రాధ బాయి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు లతో పాటుగా పర్యవేక్షకులు జి శ్రీనివాస్ శర్మ ఉన్నారు.

## సిరిసిల్ల టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ గుండెపోటుతో మృతి



సిరిసిల్ల : టియుడబ్ల్యూజే 143 సభ్యుడు సిరిసిల్ల నియోజకవర్గ టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ (45) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గర్దాస్ ప్రసాద్ గత కొన్ని సంవత్సరాలుగా మీడియా రంగంలో పనిచేస్తూ సిరిసిల్ల జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి ప్రజలతోపాటు జిల్లాలోని అధికారులతో మంచికి మారుపేరుగా సత్సంబంధాలు కలిగి ప్రజా సమస్యలను మీడియాతో పరిష్కరిస్తూ తనదైన ముద్ర వేశారు. అయితే దురదృష్టవశాత్తు ప్రసాద్ ఈరోజు గుండెపోటుతో మృతి చెందడంతో జిల్లా టియుడబ్ల్యూజే అధ్యక్షుడు లాయక్ పాషా, యూనియన్ సభ్యులు, జిల్లాలోని వివిధ మీడియా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య కుమారుడు కుమార్తె వున్నారు. ప్రసాద్ మృతితో ఆయన స్వస్థలం వేములవాడ తో పాటు సిరిసిల్లలో నియోజకవర్గల్లో తీవ్ర విషాదచాయాలు అలుముకున్నాయి.

**సిరిసిల్ల టీవీ9 జర్నలిస్ట్ ప్రసాద్ ఆకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

చాలా చురుకైన జర్నలిస్టుగా పనిచేసిన ప్రసాద్ చిన్న వయసులోనే చనిపోవడం బాధించిందన్న కేంద్ర మంత్రి. ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన సంజయ్. నిరంతరం వార్తల కోసం పనిచేసే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరిన కేంద్ర మంత్రి.

## ఎల్లారెడ్డిపేటలో బ్రెయిన్ స్ట్రోక్తో ఇంటర్ విద్యార్థి మృతి

**బిడ్డ చదువు కోసం రొట్టెలు చేస్తూ పోషణ.**

**-తండ్రి పక్షవాతంతో బాధపడుతూ..**

**-బిడ్డకు బ్రెయిన్ స్ట్రోక్ రూపంలో మృత్యువు**

**-కన్నీటి పర్యంతమైన కుటుంబం**



వాయిస్ టుడే ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట/రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన విశ్వనాథుల పూర్ణచందర్ కవిత దంపతుల కూతురు సాత్విక (15) పదో తరగతి పెద్ద బడిలో పూర్తిచేసి 491 మార్కులు సాధించింది. ఇంటర్ కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో చేర్పించి ఆ తల్లిదండ్రులు చదివిస్తుండగా గత వారం క్రితం తలనొప్పి రావడంతో సాత్విక ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించింది. వెంటనే సాత్వికను ఇంటికి తీసుకొచ్చి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ కి వెళ్లి చూపించగా మందులు రాశారు. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం సాత్వికకు తీవ్రంగా తలనొప్పి వచ్చి తల వాపురావడంతో వెంటనే అదే హాస్పిటల్ కి వెళ్లి అడ్మిట్ అయ్యారు. డాక్టర్లు సిటీ స్కాన్ చేసి పరిశీలించగా బ్రెయిన్ సమీపంలో బ్లడ్ క్లాట్ అయిందని వెంటనే సర్జరీ చేయాల్సి వస్తుందని సూచించారు. దీంతో శనివారం సాత్వికకు సర్జరీ చేస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతి చెందింది. కాగా తండ్రికి గత కొన్ని సంవత్సరాల క్రితమే పక్షవాతం రావడంతో ఇంటివద్దే ఉంటుండు. వీరిద్దరిని తల్లి కవిత రొట్టెలు చేస్తూ పోషిస్తుండగా భర్త అనారోగ్యం.. కన్న కూతురు బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందడం వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ తల్లి దొక్కలు పిక్కటిల్లేల రోదిస్తూ కన్నీటి పర్యంతమైంది. సమాచారం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు వారి ఇంటికి వెళ్లి ఓదార్చారు.

## ఏరియా అధికారిని కలిసిన మజ్దూర్ యూనియన్ నాయకులు

### - కార్మికుల సమస్యలపై చర్చించిన ఖాజా బాబా



భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : భద్రాచలం రోడ్ రైల్వే ఏరియా లోఅధికారిగా రాజేంద్ర బాబు ను సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పర్సనల్ అధికారి నియమించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్ కాజా బాబా, కొత్తగూడెం రైల్వే స్టేషన్ నందు శనివారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఖాజా బాబా మాట్లాడుతూ బిడిసిఆర్ సెక్షన్ నందు పనిచేస్తున్న కార్మికుల పక్షాన అనేక సమస్యలను రాజేంద్ర బాబు ముందు ఉంచారు. సానుకూలంగా స్పందించిన ఆయన వెను వెంటనే కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఏరియా ఇన్స్పెక్టర్ పాషా, సిగ్నల్ అధికారి మునయ్య, టిఆర్డి వీరన్న,మజ్దూర్ యూనియన్ నాయకులు ,బసవరీ పుల్లయ్య, ఓం కుమార్, శంకర్, లక్ష్మణ్, మురళి, సరోజ్ కుమార్, అరుణ్, ఉదయ్ , రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# నా మాటలను వక్రీకరిస్తే సహించేది లేదు

## విపక్ష నేతలకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వార్నింగ్



జడ్చర్ల, జులై 5 : (వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా ): బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు నాయుడు కోవర్ట్ లు తెలంగాణలో ఉన్నారని తాను చేసిన వాఖ్యలు కేవలం కాంట్రాక్టర్లను ఉద్దేశించి మాత్రమే తాను చెప్పానని, నాయకులను గురించి తాను ఎలాంటి కామెంట్స్ చేయలేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంగా తనకు సంబంధించిన వీడియోను చూడకుండానే కొందరు విపక్ష నేతలు తాను నాయకుల ఉద్దేశించి కోవర్టులంటూ మాట్లాడానని తప్పుడు ప్రచారం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుకి సంబంధించినటువంటి వ్యక్తులు కాంట్రాక్టర్లుగా పని చేస్తున్నారని, వారు ఇరిగేషన్ ప్రాజెక్టులు, పెద్ద రోడ్డు కాంట్రాక్టర్లు, హైదరాబాదులో దండాలు చేస్తున్నారని వారిని ట్రైట్ చేస్తే వారే వెళ్లి చంద్రబాబునాయుడి కాళ్లు పట్టుకొని బనకచర్ల ప్రాజెక్టు ఆపుతారని మాత్రమే తాను చెప్పానని, ఇంకా కూడా తాను ఏ నాయకుడు గురించి మాట్లాడలేదని ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి చెప్పారు. మీడియాకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. అయితే కేటీఆర్ తో సహా కొంతమంది విపక్ష నాయకులు తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ చంద్రబాబు నాయుడు కోవర్ట్ అని తాను సీఎం రేవంత్ రెడ్డిని పరోక్షంగా వ్యాఖ్యానించినట్లు చెప్పడం పట్ల ఆయన ఆక్షేపణ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి టిడిపి నుంచి వచ్చిన కారణంగా చంద్రబాబు నాయుడు కోవర్ట్ అయితే బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కూడా టిడిపి నుంచి వచ్చారనే విషయాన్ని గుర్తు గుర్తుపెట్టుకోవాలని మరి ఆయనను కూడా చంద్రబాబు నాయుడు కోవర్టుగా పరిగణించాలా అని ప్రశ్నించారు. ఈ విషయంగా తాను చేసిన వీడియోను చూసి ఆ తర్వాతే దాని గురించి మాట్లాడాలని తన వీడియోను చూడకుండా మాట్లాడడం సబబు కాదని ఆయన హితవు చెప్పారు. తాను కేవలం కాంట్రాక్టర్ల గురించే మాట్లాడానని చంద్రబాబు కోవర్టులని వాళ్లని మాత్రమే అన్నానని నాయకుల గురించి ఎక్కడ మాట్లాడలేదని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వివాదంలో సీఎంను లాగకండి అని ఆయన కోరారు. ఈ వీడియోను చూడకుండా తప్పుడు వ్యాఖ్యానాలను చేస్తే సహించేదే లేదని అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు.

## తోటి వ్యాపారస్తుడ్ని బ్రతకనివ్వరా?

### సన్ సి ఫ్యాషన్ మెన్స్ వేర్ బట్టల షాప్ యజమాని ఆవేదన




వాయిస్ టుడే ప్రతినిధి జులై 5 హుస్నాబాద్ ప్రతినిధిబీ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో హుస్నాబాద్ గ్రామ నివాసిని హుస్నాబాద్లో (సన్ సి ఫ్యాషన్ మెన్స్ వేర్,) బట్టల షాపు పెట్టుకొని జూన్ 11 నాడు ప్రారంభోత్సవం చేసుకున్నారు. షాపులో ఒక్కొక్కటి రిపేర్ చేసుకుంటున్నా రూ, గురువారం రోజున సీ.సీ కెమెరాలు ఫిట్టింగ్ చేసుకుందామని షాపులో ఉన్న (డి.వి.ఆర్ హార్డ్ డిస్క్) కోసం వెతికితే దొరకలేదు ఎవరో ఎత్తుకుపోయారని ఆలోచిస్తుండగా శనివారం రోజు షాపు తీస్తామని వెళ్లేసరికి ఫ్లెక్సీలు కట్ చేశారు. అనుమానాస్పదంగా ఎవరో కావాలని చేసినట్లుగా కనిపించడం షాపు ఓనర్ కి మనోవేదనకు గురిచేశాయి. పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. చిన్నపిల్లలు చేసిన పని మాత్రం కాదని చెప్పాలి.ఎందుకంటే అది హైట్ ఉన్నది, చిన్నపిల్లల పని కాదు, పిచ్చివాళ్లు చేసి ఉండరు,ఎందుకంటే వాడు కావాలని చేసినట్టుగా ఉంది. ఈ సంఘటన వ్యాపారస్తులు చేశారా? పక్కన వాళ్ళు చేశారా? ఎదుటి వారు చేశారా? ఎవరు చేసినా ఇలాంటి చీటింగ్ పనులు చేసిన వాడిని ఏమనాలని! షాపు యజమాని బాధతో వారికి, ఫ్యామిలీ లేదా పిల్లలు లేరా ఇలా చేయడం భావ్యమేనా పద్ధతేనా అని ఒకరి బ్రతుకు మీద కొట్టడం ఓర్వలేనితనం ఇలా చేయడం పద్ధతి కాదని హెచ్చరించారు.ఇది ఎవరు చేసినా వారికి వారి ఫ్యామిలీకి మంచిది కాదు నన్ను ఇలా చేసిన వారికి దేవుడు మంచి చేస్తాడా తప్పు చేసిన వాడికి ఏదో రోజు శిక్ష ఉంటుంది ఏదో విధంగా ఉంటుందని అన్నాడు.

## నేడు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 5: భద్రాద్రి జిల్లాలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన నిర్వహించనున్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రెవిన్యూ రాష్ట్ర ప్రభుత్వం పేదోడి సొంత ఇంటి కలలు నెరవేర్చే దిశగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇడ్ల పథకంలో భాగంగా చుంచుపల్లి, లక్ష్మిదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఎస్ఆర్ఆటి, మాయాబజార్, వనమా కాలని నిర్వాసితులకు ఇంటి స్థలాల లబ్ధిదారులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఉదయం 11 గంటలకు భారీ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. పాల్గొననున్నారు. అనంతరం లక్ష్మిదేవిపల్లి మండలంలోని సీతారాంపురం, చింతపెంటిగూడెం లలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. జిల్లా అధికారులు కార్యక్రమాలకు అవసరమైన భద్రతా సాంకేతిక ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు.

## తండ్రి జయంతి కొడుకు అనాధ పిల్లలకు అన్నదాన భోజన వసతి



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జులై 5: (పాలమూరు) నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు నెంబర్ 5 కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.అజయ్ కుమార్ వారి తండ్రి కీర్తి శేషులు ధన్ పాల్ (సూపరింటెండెంట్ డిహెచ్ ఎంఓ ఆఫీస్ ) జయంతిని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పట్టణం లోని ఏనుగొండ లో నిర్వహిస్తున్న సన్నిధి అనాదాశ్రమం లో చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతి లను వర్ధంతిలను పురస్కరించుకుని విరివిరిగా పట్టణంలోని ప్రముఖులు సన్నిధి ఆశ్రమంలో చిన్నారులతో జరుపుకోవాలని ఆయన అన్నారు. అవకాశం ఉన్నవారు అనాదాశ్రమం లో ఉన్న పిల్లలను దత్తత తీసుకొని,వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. అనంతరం చిన్నారులతో కలిసి ఆయన భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో వడే శివ కుమార్ ,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు



## అర్హులైన కళాకారులను ప్రభుత్వం గుర్తించి అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రికీ వినతి

హుజూర్ నగర్ జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): అర్హులైన కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కు వినతి పత్రం అందించారు హుజూర్ నగర్ కళాకారులు. రంగస్థలం సంక్షేమ సంఘం హుజూర్ నగర్ వ్యవస్థాపక అధ్యక్షులు దొంతగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ని రవీంద్ర భారతి లోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో హుజూర్ నగర్ కళాకారులు కలసి కళాకారుల సమస్యల గురించి వివరించి వారికి గుర్తింపు కార్డులు పెన్షన్లు మరియు ప్రదర్శన ఇవ్వడానికి కావలసిన ఏర్పాట్లు చేయాలని మరియు అవసరమైన వారికి ఇండ్లు ఇళ్ల స్థలాలు కూడా ఇప్పించాలని వినతి పత్రం అందించడం జరిగింది ఈ సందర్భంగా మంత్రి కృష్ణారావు స్పందిస్తూ కళాకారుల కోరికలు నెరవేరుస్తానని ముందుగా అర్హులైన వారికి గ్రామాల వారీగా సమీకరణ చేసి నిజమైన అర్హులైన కళాకారులకు పెన్షన్ ఇస్తామని ఆ తదుపరి గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని కళాకారుల కు సంబంధించిన విషయాలపై నిర్ణయాలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. కళాకారులందరూ ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు దొంతగానీ సత్యనారాయణ వెంకటేశ్వర్లు కష్టాల వీరబాబు నమ్మాలి శ్రీనివాస్ బెల్లంకొండ సైదులు బెల్లంకొండ రామ జోగి బత్తిని మల్లయ్య కే భద్రాచలం ఎం శీను రెక్కల రామిరెడ్డి మరియు లాజర్ ఇట్ట మల్ల వినోద్ కళాకారులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్తులు కావాలి

హుజూర్ నగర్ జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణలో అందరు భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ పోసాని వెంకటరమణారావు మున్సిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్ అన్నారు హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అందరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు కృషి చేయాలని అన్నారు. దీంతోపాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రేమ్ సాగర్, ప్రియాంక, ఆశాజ్యోతి, సతీష్, రమాదేవి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తన వంతు సహాయంగా కొంత డబ్బు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల...జూలై 5(వాయిస్ టుడే) శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఒక రోజు భవన నిర్మాణ సహాయకుడిగా శ్రమదానం చేసి, నిర్మాణం కోసం తన వంతు సహాయంగా పది వేల రూపాయలను లబ్ధిదారు అయిన స్టేషన్ల లక్ష్మి ,మాణయ్య కు సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది ఎర్రోళ్ల ఆనంద్ రావు.ప్రతి మనిషికి నీరు, కూడు, గుడ్డ, ఇల్లు అనేది చాల అవసరం. చాలా మందికి పక్క ఇల్లు అనేది జీవిత కాలం ఒక కల. ఆ కలలను నిజం చేసేందుకు , అర్హులైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు ఆర్థిక సహాయం క్రింద ఐదు లక్షల రూపాయలను ఇస్తుంది. ఇట్టి అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి సహోదరులు శాంతి కుమార్, సుదర్శన్, వెంకటేష్,కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## నూతనంగా ఎన్నికైన పరపతి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం

హుజూర్ నగర్ జులై 05 (వాయిస్ టుడే ప్రతినిధి) హుజూర్ నగర్ నియోజకవర్గం గరిడేపల్లి మండలం సర్వారం వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతనంగా ఎన్నికైన, చైర్మన్. పేండేం ముత్యాలు వైస్ చైర్మన్, గుమ్మ డేల్లీ కృష్ణకుమారి మరియు డైరెక్టర్లు శనివారం రోజు ప్రమాణస్వీకారం చేయడం జరిగింది ఈ సందర్భంగా చైర్మన్ ఉప చైర్మన్ లను సర్వారం మాజీ సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి డైరెక్టర్లు దొంతగాని ఎల్లయ్య ఎడవెల్లి వెంకటరెడ్డి సాలువా లతో ఘనంగా సన్మానించి. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గుమ్మడేల్లి రాముడు దొంతగాని అంజయ్య సిద్ధం వెంకటేశ్వర్లు పెండెం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

నందిగామ: ప్రేమించానని, వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించి గర్భవతిని చేసి, అనంతరం మొహం చాటేసిన యువకుడిని నందిగామ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ వైవీవీఎల్ నాయుడు తెలిపిన వివరాల మేరకు..ఖమ్మం జిల్లా మధిర మండలం మడుపల్లి గ్రామానికి చెందిన వేల్పుల జగదీష్.. చరవాణి సిమ్ కార్డులు విక్రయిస్తుంటాడు.. అతడికి ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ప్రేమించానని, వివాహం చేసుకుంటానని సదరు యువతిని జగదీష్ నమ్మించి గర్భవతిని చేశాడు. అనంతరం మొహం చాటేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌కు పంపుతూ న్యాయమూర్తి ఆదేశించినట్లు సీఐ వెల్లడించారు.

## కారులో వచ్చి చోరీ?

ఖమ్మం : కారులో వచ్చిన వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన ఖమ్మం నగరం దానవాయిగూడెంలో చోటుచేసుకుంది. ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు కథనం ప్రకారం... ఖమ్మం నగరపాలక సంస్థలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే గండ్ర మల్లికార్జునరావు దానవాయిగూడెం పార్కు దగ్గర నివసిస్తున్నాడు. ఆయన భార్య రాజేశ్వరి ప్రైవేటు పాఠశాలలో పని చేస్తోంది. వీరు లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం వారి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 4 తులాల బంగారం తస్కరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు శనివారం కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. విచారణలో పోలీసులు స్థానికంగా సీసీ కెమెరాలను పరిశీలించినప్పుడు ఓ వ్యక్తి కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఈ వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

## చదరంగంలో డీసీసీబీ ఉద్యోగుల ఉత్సాహం

ఖమ్మం: ఖమ్మం డీసీసీబీలో ఆ శాఖ ఉద్యోగులకు శనివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఇందులో మహిళా ఉద్యోగులు అత్యధికంగా పాల్గొని హెూరాహెూరీ పోరాట పటిమ చూపడం విశేషం. మహిళా విభాగంలో కె.నాగలక్ష్మి ప్రథమ, ఎన్.దుర్గాదేవి ద్వితీయ, పురుషుల విభాగంలో ఖాజపాషా ప్రథమ, జి.ప్రవీణ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. సీఈఓ వెంకట ఆదిత్య, డైరెక్టర్ పి.రామబ్రహ్మం, జనరల్ మేనేజర్ వి.వసంతరావు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. రానున్న జిల్లాస్థాయి చదరంగం పోటీలకు గట్టి కసరత్తుతో డీసీసీబీ బ్యాంకు జట్టు రంగంలోకి దిగాలని అతిథులు తమ సందేశంలో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్ శివకృష్ణ, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎస్సీ గురుకులాల్లో సర్దుబాటు



కొత్తగూడెం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ సర్దుబాటుకు శ్రీకారం చుట్టింది. అద్దె భవనాల్లోని గురుకులాల్లో చదివే విద్యార్థులతోపాటు అధ్యాపకుల్ని ఇతర ప్రాంతాలకు తరలించింది. మహిళా ప్రాంగణాల్లో పనిచేస్తున్న పురుష అధ్యాపకుల్ని బదిలీ చేశారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 16మంది బదిలీ అయ్యారు. కొన్ని విద్యాలయాల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కోర్సులు తొలగించారు.

కూసుమంచి గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ కోర్సు చదివే బాలికలను ఖమ్మం దానవాయిగూడెం గురుకులంలో కలిపి నలుగురు అధ్యాపకుల్ని సర్దుబాటు చేశారు.

సత్తుపల్లి గురుకులంలో ఇంటర్ ద్వితీయ ఎంపీసీ తీసేసి బాలురను తిరుమలాయపాలెం, ముదిగొండ గురుకులాల్లో విద్యార్థులను సర్దుబాటు చేశారు. అక్కడి నలుగురు అధ్యాపకుల్ని వేరేచోటుకు పంపారు.

భద్రాద్రి జిల్లాలో మణుగూరు గురుకులంలో ఎంఈసీ విద్యార్థులను దమ్మపేటకు పంపించారు.

భద్రాచలం గురుకులం బైపీసీ పిల్లలను పాల్వంచ నవభారత్ గురుకులానికి సర్దుబాటు చేశారు. ముగ్గురు అధ్యాపకుల్ని పలుచోట్ల డిప్యూటేషన్ చేశారు. ఉభయ జిల్లాల్లోని బాలికా విద్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అయిదుగురు పురుష అధ్యాపకుల్ని బదిలీ చేశారు.

**ఇదీ ఉద్దేశం..** ఉభయ జిల్లాల్లో పలు గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయాచోట్ల సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు తీసుకోకుండా ద్వితీయ సంవత్సరం విద్యార్థులను సమీప ఏరియాల్లో సొంత భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో సర్దుబాటు చేశారు. వాటివద్ద ప్రయోగ పరికరాలు, క్రీడామైదానాలు, వసతి సదుపాయం ఉండడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నది ఉన్నతాధికారుల భావన.